సాక్షి
అనంతపురం
బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.4.50, సరాసరిన రూ.6.50 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.2°/ 22.7°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

44 ప్రాసెసింగ్ యూనిట్ల మంజూరు



అనంతపురం అగ్రికల్చర్: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం (మిల్లెట్ ఇయర్)ను పురస్కరించుకుని జాతీయ సుస్థిర వ్యవసాయాభివృద్ధి పథకంలో భాగంగా జిల్లాకు 44 ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరైనట్లు జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాధార ప్రాంత అభివృద్ధి కింద జిల్లాలో ఎంపిక చేసిన 11 రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రాసెసింగ్ యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ 44 మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు వీలుగా వివిధ పరికరాలు సమకూర్చడానికి ఈ నెల 22న సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు అనంతపురంలో 'జగనన్నకు చెబుదాం'

అనంతపురం అర్బన్: నగర ప్రజల కోసం బుధవారం ఉదయం 9.30 గంటలకు కృష్ణకళా మందిరంలో 'జగనన్నకు చెబుదాం–స్పందన' నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొంటారన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

'ఆదరణ' బాధితులు సంప్రదించండి

అనంతపురం క్రైం: ఆదరణ చిట్ ఫండ్ బాధితులు అనంతపురం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించి సమస్యను విన్నవించవచ్చని ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. అలాగే 'స్పందన' (93929 26803) లేదా తన (9440796800) నంబర్లకు కూడా పిటిషన్లు పంపవచ్చని సూచించారు.

● వినాయక సందడి



అనంతపురం కమలానగర్‌లో 'సత్యమేవ జయతే' వినాయకుడు



అశోక్‌నగర్‌లో ఎడ్లబండిపై కొలువుదీరిన గణేశుడు



సప్తగిరి సర్కిల్ వినాయకచౌక్‌లో కదలిక వినాయకుడు

వినాయక చవితి సందర్భంగా జిల్లా అంతటా సందడి నెలకొంది. పల్లె నుంచి నగరం దాకా వాడవాడలా బొజ్జ గణపయ్య కొలువుదీరాడు. లంబోదరుడికి ప్రత్యేక పూజలు చేసి.. నైవేద్యం సమర్పించారు. భక్తులు పెద్ద ఎత్తున మంటపాలకు తరలివచ్చి విభిన్న ఆకృతుల్లోని గణనాథులను దర్శించుకున్నారు. వినాయకుడి జన్మవృత్తాంతం తెలియజేసే ఘట్టాలను తెలుసుకుని భక్తితో ప్రణమిల్లారు. తొలిరోజు సోమవారం నుంచి మలిరోజు మంగళవారం దాకా భక్తులు మంటపాలకు పోటెత్తారు. ఎక్కడ చూసినా జై గణేశ.. జైజై గణేశ నినాదం ప్రతిధ్వనించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అనంతపురం సప్తగిరి సర్కిల్ వినాయకచౌక్‌లో గణేశుడిని దర్శించుకునేందుకు బారులు దీరిన భక్తులు

పక్కాగా ఓటర్ల జాబితా

- డూప్లికేట్ ఓట్లపై ప్రత్యేక పరిశీలన
- సాఫ్ట్‌వేర్ ద్వారా పీఎస్‌ఈ ఓట్ల గుర్తింపు
- ఒకటికి మించి ఉంటే నోటీసు ఇచ్చి, తొలగింపు

ఇంటింటి సర్వేలో గుర్తించిన అంశాలు

మరణించిన ఓటర్ల సంఖ్య	20,993
శాశ్వతంగా నివాసం మారిన ఓటర్ల సంఖ్య	18,102
డబుల్ ఎంట్రీ ఓట్ల సంఖ్య	1,413



ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో తొలగింపు ఓట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి (ఫైల్)

అనంతపురం అర్బన్: తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ముఖ్యంగా డూప్లికేట్ ఓట్లపై ప్రత్యేక పరిశీలన పక్కాగా నిర్వహిస్తోంది. ఎన్నికల కమిషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా పీఎస్‌ఈ (ఫొటో సిమిలర్ ఎంట్రీ), డీఎస్‌ఈ (డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీ) ఓట్లను గుర్తిస్తున్నారు. 2022 జనవరి 6 నుంచి ఈ ఏడాది ఆగస్టు 9 వరకు జిల్లావ్యాప్తంగా పీఎస్‌ఈ, డీఎస్‌ఈ కింద 76,858 ఓట్లను గుర్తించి, తొలగించారు. ఇక ప్రత్యేక ఓటరు జాబితా సంక్షిప్త సవరణ–2024లో భాగంగా నిర్వహించిన ఇంటింటి సర్వేలో మరణించిన ఓటర్లు 20,993 మంది, శాశ్వతంగా నివాసం మారిన ఓటర్లు 18,102, డబుల్ ఎంట్రీ ఓట్లు 1,413గా గుర్తించారు. వీటిపై పరిశీలన చేస్తున్నారు. ఒకటికి మించి ఓట్లు కలిగిన ఓటరుకు నోటీసు ఇచ్చి వారు కోరుకున్న చోట ఓటును ఉంచి, మిగిలిన ఓట్లను తొలగిస్తారు.

పీఎస్‌ఈ, డీఎస్‌ఈ గుర్తిస్తారిలా..

ఒక వ్యక్తికి ఒకటికి మించి ఓట్లను గుర్తించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ రూపొందించింది. కంప్యూటర్ ఆపరేటర్ తప్పిదం కారణంగా లేదా ఒక వ్యక్తి రెండు, మూడు సార్లు దరఖాస్తు చేసుకోవడం ద్వారా ఒకటికి మించి ఓట్లు నమోదవుతాయి. అలాంటి ఓట్లను పీఎస్‌ఈ (ఫొటో సిమిలర్ ఎంట్రీ) అంటారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఒకే ఫొటోతో ఉన్న ఓటర్లను గుర్తించి ఒక సీరియల్ ఆర్డర్‌లోకి తీసుకొస్తుంది. ఇక డీఎస్‌ఈ (డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీ) ఓటు విషయానికి వస్తే... ఓటరు పేరు, తండ్రిపేరు ఒకటే ఉన్న ఓట్లను ఒక సీరియల్ ఆర్డర్‌లోకి తీసుకొస్తుంది.

నిబంధన మేరకు తొలగింపు




ఒక వ్యక్తికి ఒకటికి మించి ఓట్లు ఉంటే ఎన్నికల కమిషన్ నిబంధన మేరకు తొలగిస్తాం. ఒకటికి మించి ఓట్లు ఉన్న విషయాన్ని ఓటరుకు నోటీసు ద్వారా తెలియజేస్తాం. ఏ చిరునామాలోని ఓటు ఉంచాలి అనేదానిపై ఓటరు నిర్ణయాన్ని తీసుకుంటాం. ఓటరు అభీష్టం మేరకు కోరుకున్న చిరునామాలో ఓటును ఉంచి, మిగిలిన ఓట్లను తొలగిస్తాం.

– గాయత్రీదేవి, డీఆర్‌ఓ

2022 జనవరి 6 నుంచి ఈ ఏడాది ఆగస్టు 9 వరకు తొలగించిన పీఎస్‌ఈ, డీఎస్‌ఈ ఓట్లు

నియోజకవర్గం	పీఎస్‌ఈ/ డీఎస్‌ఈ ఓట్లు
రాయదుర్గం	6,102
ఉరవకొండ	5,345
గుంతకల్లు	9,773
తాడిపత్రి	9,769
శింగనమల	5,945
అనంతపురం	24,533
కళ్యాణదుర్గం	5,053
రాప్తాడు	10,338
మొత్తం	76,858



ఒకటికి మించి ఉన్న ఓట్లు

ఫిర్యాదులపై పరిశీలన పూర్తి

- సీఈఓకు వివరించిన కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి అందిన 56,874 ఫిర్యాదుల పరిశీలన పూర్తి చేశామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్ కుమార్ మీనాకు కలెక్టర్ గౌతమి తెలియజేశారు. ఓటర్ల జాబితా సవరణ, డబుల్ ఎంట్రీ ఓట్లు, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, ఫిర్యాదుల పరిశీలన, తదితర అంశాలపై సీఈఓ మంగళవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రీదేవి పాల్గొన్నారు. ఓటరు జాబితా సవరణకు సంబంధించి జిల్లాలో పరిస్థితిని సీఈఓకు ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టిన సర్వేలో 56,874 ఫిర్యాదులు రాజకీయ పార్టీల నుంచి వచ్చాయన్నారు. వీటిని పరిశీలన పూర్తి చేశామని, మరో మారు పరిశీలన నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా మరణించిన వారి ఓట్లకు సంబంధించి అందిన 20,993 ఫిర్యాదుల పరిశీలన పూర్తి చేశామన్నారు. ఆయా క్లెయిమ్‌లకు సంబంధించి దరఖాస్తులను సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న అప్‌డేషన్ ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామన్నారు. శాశ్వతంగా షిఫ్ట్ అయిన ఓటర్ల జాబితానూ పరిశీలించామన్నారు. ఫారం–6, 7, 8లకు సంబంధించి సకాలంలో పరిశీలన పూర్తికి చర్యలు చేపట్టామన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియకు సంబంధించి ప్రతిపాదనలు వచ్చాయన్నారు. సీఈఓ మాట్లాడుతూ రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఇంటి నంబరు వారీగా పరిశీలన చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓలు మధుసూదన్, నిశాంత్‌రెడ్డి, రవీంద్ర, ఈఆర్‌ఓలు సుధారాణి, శ్రీనివాసులు, కేశవనాయుడు, శంకరయ్య, వెంకటేశ్వర్లు, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు, ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి గడ్డు కాలమే

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం టవర్‌క్లాక్: టీడీపీకి గడ్డు కాలం దాపురించిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. అనంతపురంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పం ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అరెస్ట్‌పై ఆ పార్టీ నేతలు చేపడుతున్న ఆందోళన కార్యక్రమాల్లో చిత్తశుద్ధి లేకుండా పోయిందన్నారు. ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో కొద్ది సేపు పాల్గొని, అనంతరం వారి దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమవుతుండడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇదంతా చూస్తుంటే చంద్రబాబు అవినీతికి పాల్పడినట్లుగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తిగా విశ్వసిస్తున్నట్లుగా తెలుస్తోందన్నారు. ఇక బాబును నమ్ముకుంటే తాము కూడా నట్టేట మునుగుతామనే అభిప్రాయం టీడీపీ నేతల్లో స్పష్టమవుతోందన్నారు. టీడీపీ హయాంలో ఉన్నప్పుడు స్కిల్ డెవలప్మెంట్, ఏపీ ఫైబర్ గ్రిడ్, పోలవరం ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతి, అమరావతి రాజధాని నిర్మాణంలో దోపిడీ వంటి అంశాలు చంద్రబాబు, నారా లోకేష్ మెడకు చుట్టుకుంటున్నాయన్నారు. బాబు అవినీతి నిజం కావడం వల్లనే ప్రముఖ న్యాయవాదులు ఎంత పోరాడినా బెయిల్ మంజూరు కావడం లేదన్నారు. ఇకపై ఆయనకు బెయిలు వస్తుందన్న నమ్మకం కూడా టీడీపీ కార్యకర్తల్లో లోపిస్తోందన్నారు. కుంభకోణాల్లో నారా లోకేష్ హస్తముందని, త్వరలో ఆయననూ అరెస్ట్ చేస్తారనే వాదనలను ఆ పార్టీ వర్గాలే వెల్లడిస్తున్నాయన్నారు. ఈ క్రమంలో అచ్చెన్నాయుడు అసహనానికి గురవుతూ డబ్బులు ఇచ్చి, ప్రలోభాలకు గురిచేసి ధర్నాలు విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునివ్వడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు అరెస్ట్ అక్రమమంటూ ఎల్లో మీడియాలో వస్తున్న కథనాలను ఆ పార్టీ కార్యకర్తలే నమ్మడం లేదన్నారు. ఈ క్రమంలోనే పొత్తు పేరుతో జనసేన పవన్‌కళ్యాణ్ కుంపటి రాజేసి టీడీపీని పూర్తిగా భూస్థాపితం చేసే కుట్రలకు తెరతీశారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, నాయకులు ఎగ్గల శ్రీనివాసులు, మదన మోహన్‌రెడ్డి, ధనుంజయ యాదవ్ పాల్గొన్నారు.

బెటాలియన్ కమాండెంట్ బాధ్యతల స్వీకరణ



బుక్కరాయసముద్రం: జంతలూరు వద్దనున్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్‌గా గంగాధర్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న జగదీష్ తూర్పు గోదావరి ఎస్పీగా బదిలీపై వెళ్లారు. అన్నమయ్య జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న గంగాధర్‌రావు బదిలీపై ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌కు కమాండెంట్‌గా వచ్చారు. ఈ సందర్భంగా అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, సిబ్బంది కమాండెంట్‌కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. కమాండెంట్ గంగాధర్‌రావు మాట్లాడుతూ బెటాలియన్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

టీడీపీ నాయకుల దాష్టీకం





బైకు తీయాలని కోరుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజ్‌కుమార్ (వృత్తంలో), కుర్చీ విసురుతున్న టీడీపీ నేత

- బైక్ అడ్డు తీయమన్నందుకు దాడి
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు తీవ్రగాయాలు



గాయపడిన రాజ్‌కుమార్

కళ్యాణదుర్గం: తన దుకాణానికి అడ్డుగా నిలిపిన బైకును పక్కకు తీయండని చెప్పిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నాయకులు దాష్టీకం ప్రదర్శించారు. విచక్షణారహితంగా దాడి చేయడంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజ్‌కుమార్ గాయపడ్డారు. కళ్యాణదుర్గంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు గత కొన్ని రోజులుగా వాల్మీకి సర్కిల్ పక్కన ఖాళీ స్థలంలో రిలేదీక్షలు చేస్తున్నారు. ఈ దీక్షా శిబిరం పక్కనే మున్సిపల్ కౌన్సిలర్ పరమేశ్వరప్ప కుమారుడు, వైఎస్సార్‌సీపీ కార్యకర్త అయిన రాజ్‌కుమార్ కూరగాయల దుకాణం ఉంది. మంగళవారం ఉదయం 11.10 గంటల సమయంలో టీడీపీ నాయకులు దీక్షా శిబిరానికి వచ్చారు. ఇంతలో ఓ టీడీపీ నాయకుడు తన బైకును కూరగాయల దుకాణం ముందు నిలిపాడు. దుకాణానికి అడ్డం అవుతుందని రాజ్‌కుమార్ అభ్యంతరం తెలపడంతో సదరు నాయకుడు బైకును పక్కకు తీసుకెళ్లిపోయాడు. దీన్ని గమనించిన ఉన్నం వర్గీయుడు యర్రంపల్లి సత్తి 'ఏరా...నువ్వు వైఎస్సార్‌సీపీనా' అంటూ దుర్భాషలాడుతూ ఊగిపోయాడు. శిబిరంలోని కుర్చీని తీసుకొచ్చి బలంగా విసరగా.. రాజ్‌కుమార్ గమనించి పక్కకు ఒరిగాడు. అక్కడే ఉన్న టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, షామీర్ తదితరులు రాజ్‌కుమార్‌ను చుట్టుముట్టి దాడికి దిగారు. ఇదంతా మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కుమారుడు ఉన్నం మారుతి చౌదరి సమక్షంలోనే జరగడం గమనార్హం. దాడిలో గాయపడిన రాజ్‌కుమార్‌ను తండ్రి పరమేశ్వరప్ప ప్రభుత్వాసుపత్రిలో చేర్పి, పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్

వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజ్‌కుమార్‌పై దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజ్‌కుమార్‌ను పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మాజీ మండల కన్వీనర్ తిరుమల వెంకటేశులు, నాయకులు ఉమాపతి, ఉమేష్, గణేష్ పరామర్శించి ధైర్యం చెప్పారు. టీడీపీ నాయకులు చిరు వ్యాపారిపై తమ ప్రతాపాన్ని చూపించడం సరైంది కాదన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా సాగాలి

- ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి : ఎస్పీ
- నేడు జిల్లాలో 2,711 విగ్రహాల నిమజ్జనం

అనంతపురం క్రైం: జిల్లాలో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా సాగేలా పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీ కేకేఎస్ అన్బురాజన్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. వినాయక ప్రతిమల ఊరేగింపు మొదలు నిమజ్జనం పూర్తయ్యే వరకూ అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మూడు దశల్లో ఈ నెల 20, 22, 26 తేదీల్లో నిమజ్జన కార్యక్రమాలు ఉంటాయన్నారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం చిన్న, పెద్దవి కలిపి 2,711 గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేయనున్నారని తెలిపారు. ఇందుకు తగ్గట్టుగానే పోలీసు శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీ, రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టామన్నారు. నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు ఉత్సవ కమిటీల నిర్వాహకులు, శాంతి కమిటీలు సంయుక్తంగా కృషి చేయాలని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. నిమజ్జన ప్రాంతంలో సీసీ కెమెరాలు, లైటింగ్, వైద్య సిబ్బంది, ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిమజ్జన ప్రాంతంలో పిల్లలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లు, నేర చరితులపై నిఘా కొనసాగించాలన్నారు.

నిమజ్జన ప్రదేశం పరిశీలన

వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడానికి ఎంపిక చేసిన ఆత్మకూరు మండలం పంపనూరు సమీపంలోని కెనాల్ ప్రాంతాన్ని ఎస్పీ అన్బురాజన్ సోమవారం పరిశీలించారు. అలాగే నగరంలో సప్తగిరి సర్కిల్, రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని ట్రాఫిక్ తీరును పరిశీలించి, విజిబుల్ పోలీసు అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసాదరెడ్డి, బీవీ శివారెడ్డి, ఇటుకలపల్లి సీఐ నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

తప్పుడు పోస్టులు పెడితే చర్యలు

సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు చేసినా, తప్పుడు పోస్టులు పెట్టినా బాధ్యులపై చర్యలు తప్పవని ఎస్పీ ఒక ప్రకటనలో హెచ్చరించారు.



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అర్జీలకు త్వరితగతిన పరిష్కారం

'స్పందన'అర్జీలకు త్వరగా పరిష్కారం చూపాలని ఎస్పీ అన్బురాజన్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో ఎస్పీ 'స్పందన'లో ఎనిమిది అర్జీలు స్వీకరించారు. నేరుగా వచ్చి పిటిషన్లు ఇవ్వలేని వారు 9392926803 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు.

గౌరవంగా మాట్లాడాలి

గార్లదిన్నె: ఫిర్యాదుదారులతో పోలీసులు గౌరవంగా మాట్లాడాలని ఎస్పీ అన్బురాజన్ సూచించారు. మంగళవారం గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు పూర్తి చేయాలన్నారు.

పకడ్బందీగా ఈ–క్రాప్

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్–2023 పంటల నమోదు ప్రక్రియ (ఈ–క్రాప్) ఈసారి మరింత పకడ్బందీగా కొనసాగిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల నడుమ జూలై, ఆగస్టుతో పాటు ఇప్పుడు ప్రత్యామ్నాయం కింద మందకొడిగా పంటలు వేశారు. పెట్టుబడిరాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ), ఉచిత పంటల బీమా (ఇన్సూరెన్స్), సున్నావడ్డీ పంటరుణాలు, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో పంట ఉత్పత్తుల అమ్మకాలు లాంటి ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు దక్కాలంటే ఈ–క్రాప్ నమోదును ప్రామాణికంగా తీసుకుంటారు. భవిష్యత్తులో రైతులకు సమస్యలు రాకుండా, ఇబ్బందులు తలెత్తకుండా ఈ–క్రాప్ నమోదును పారదర్శకంగా చేపడుతున్నారు. ఒక వైపు క్షేత్రస్థాయిలో పొలంలోకి వెళ్లి పంటల వివరాలతో ఈ–క్రాప్ తీసుకుంటూ, మరో వైపు రైతు వివరాలతో కూడిన ఈ–కేవైసీ కూడా తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియలో పొరపాట్లు జరగకుండా అధికారులు 'సూపర్ చెక్' కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

72 శాతం ఈ–క్రాప్ : ఈ ఖరీఫ్‌లో సాగులోకి వచ్చిన వ్యవసాయ, ఉద్యాన, మల్బరీ తదితర అన్ని రకాల పంటలను ఈ–క్రాప్ చేస్తున్నారు. ఇప్పటి వరకు అన్ని రకాల పంటలు 8.14 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. అందులో ఇప్పటివరకు 72 శాతం అంటే 5.87 లక్షల ఎకరాలకు ఈ–క్రాప్ పూర్తయ్యింది. మిగిలిన 2.27 లక్షల ఎకరాలు ఈ నెలాఖరులోపు పూర్తి చేసేలా ఆర్‌బీకే వేదికగా కార్యక్రమాన్ని చురుగ్గా కొనసాగిస్తున్నారు. నెలాఖరులోపు వంద శాతం ఈ–క్రాప్ పూర్తయితే... అక్టోబర్ 5 నాటికి ఈ–కేవైసీ పూర్తికి ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. అక్టోబర్ 5 నుంచి 10 వరకు ఈ–క్రాప్ జాబితాలు ఆర్‌బీకేల్లో ప్రదర్శించాల్సి ఉంటుంది. అందులో ఎక్కడైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే అక్టోబర్ 11 నుంచి 14 వరకు వాటిని పరిశీలించి సరిదిద్దాలని ఆదేశాలు ఇచ్చారు.

క్లుప్తంగా

ఎంసీఏ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో నిర్వహించిన ఎంసీఏ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ ఫలితాలు మంగళవారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ విడుదల చేశారు. పరీక్షలు ఈ నెల 13న ముగిశాయి. కేవలం ఆరు రోజుల వ్యవధిలోనే ఫలితాలు విడుదల కావడం గమనార్హం. ఫలితాలను విద్యార్థులు ఆ కళాశాల అకడమిక్ సెక్షన్‌ను అడిగి తెలుసుకోవచ్చు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణకాంతి, పాలక మండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి, హెచ్‌ఓడీలు ప్రొఫెసర్ ఎస్.చంద్ర మోహన్‌రెడ్డి, డాక్టర్ కేఎఫ్ భారతి, డాక్టర్ కె.కళ్యాణిరాధ, డాక్టర్ బి.దిలీప్‌కుమార్, బి.అజిత, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి.విష్ణువర్ధన్, డాక్టర్ డి.లలిత కుమారి పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం



జీవన్‌కుమార్ (ఫైల్)

కంబదూరు: అప్పులు తీర్చలేక ఇబ్బంది పడుతున్న తల్లిదండ్రులను చూసి తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కంబదూరు మండలం కొత్తపల్లికి చెందిన హనుమంతరాయుడు కుమారుడు జీవన్‌కుమార్ (24) శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమలో ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన జీవన్‌కుమార్... పంటల సాగుకు చేసిన అప్పు తీర్చలేక తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులు కళ్లారా చూశాడు. అప్పులు తీర్చలేక కుమిలిపోతున్న తల్లిదండ్రులను చూసి, మనస్తాపానికి గురైన ఆయన సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగాడు. విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించేలోపు మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వ్యాధి ఏదైనా.. ఒక్క గొర్రెతోనే మొదలు

- నీలినాలుక, గిట్టపుండ్ల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- పశుశాఖ జేడీ సుబ్రహ్మణ్యం, ఏడీడీఎల్ ఏడీ రామచంద్ర వెల్లడి



గొర్రెల్లో నీలినాలుక వ్యాధి లక్షణాలు



జీవాల్లో గిట్టపుండ్ల వ్యాధి లక్షణాలు ఇలా

అనంతపురం అగ్రికల్చర్: ఏ వ్యాధి ప్రబలినా తొలుత ఒక గొర్రెతోనే మొదలవుతుందని, సకాలంలో దానిని గుర్తించి పశు వైద్యున్ని సంప్రదించడం ద్వారా తగిన జాగ్రత్తలతో వ్యాధి విస్తరించకుండా జీవాలను కాపాడుకోవచ్చని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (ఏడీడీఎల్) ఏడీ డాక్టర్ ఎస్.రామచంద్ర అన్నారు. ఇటీవల కురిసిన తేలికపాటి వర్షాలు, పెరిగిన గాలులు, మారిన వాతావరణ పరిస్థితులకు జీవాల్లో ప్రమాదకరమైన నీలినాలుక వ్యాధి (బ్లూటంగ్), మూతిపుండ్లవ్యాధి, కాలిపుండ్లవ్యాధి (ఫుట్‌రాట్) సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

- నీలి నాలుక (బ్లూటంగ్), మూతి పుండ్ల వ్యాధి సోకితే జ్వరం, మూతి వాపు, పెదవులు దద్దరించడం, నోటి లోపల పుండ్లు, ముక్కులో చీమిడి, కాళ్ల కుంటు, ఒంట్లో నీరు చేరి పారుకోవడం, మేత మేయకపోవడం, ఈసుకుపోవడం (అబార్షన్)తో పాటు 30 శాతం వరకూ మరణాలు సంభవిస్తాయి. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వ్యాధి సోకిన గొర్రెను వేరు చేసి పశువైద్యున్ని సంప్రదించి సరైన చికిత్స చేయించాలి. సాయంత్రం పూట గొర్రెల మందలో వేపాకు పొగ వేయడం, అపుడప్పుడు బ్లూట్యాక్స్ లేదా టిక్కిల్ మందుతో పిచికారీ చేస్తుండాలి. పాడి ప్రాంతాల్లోనే మేపునకు తీసుకెళ్లాలి. ఈ ఏడాది ఇప్పటి వరకూ బ్లూటంగ్‌కు సంబంధించి 15.18 లక్షల డోసుల వ్యాక్సినేషన్ పూర్తయింది.
- కాలిగిట్టల మధ్య చీము చేరడం, చెడు వాసన రావడం లాంటి లక్షణాలు కనిపిస్తే కాలిపుండ్ల వ్యాధిగా గుర్తించాలి. బురద ప్రాంతాల్లో జీవాలను మేపకూడదు. నట్టల నివారణ మందులు తాగించాలి.

కాపర్లూ ఈ సూచనలు పాటించండి..

వ్యాధి వల్ల చనిపోయిన జీవాల కళేబరాలను అమ్మకూడదు, తినకూడదు. ఊరికి దూరంగా గుంత తవ్వి సున్నం చల్లి పాతిపెట్టాలి. కొన్ని జీవాలు చనిపోయే వరకూ ఆరోగ్యంగా ఉన్నట్లుగానే మొండిగా మేత మేస్తూ ఉంటూ ఉన్నఫలంగా మరణిస్తాయి. పై లక్షణాలు కనిపించిన వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తినకూడదు, అమ్మకూడదు. జీవాలకు ఎప్పుడూ పారే నీళ్లు, బోరు నీళ్లు తాగించాలి. నిల్వ ఉన్న నీటిని ఎలాంటి పరిస్థితుల్లోనూ తాపరాదు. జబ్బు బారిన పడిన ఒక గొర్రెను సకాలంలో గుర్తించకపోతే మిగిలిన గొర్రెలకూ విస్తరించే ప్రమాదముంది. జబ్బు బారిన పడి మృతిచెందిన గొర్రె లేదా దాని పేడ, ఇతర అవయవాలు సేకరించి వెంటనే పశువైద్యున్ని సంప్రదించాలి.

కసాపురం ఆలయంలో చోరీ

- చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ చేతి వాటం
- రెండు నిమిషాల వ్యవధిలో 8 సార్లు హుండీలో నగదు అపహరణ



హుండీలో నగదు అపహరిస్తున్న కృష్ణారెడ్డి (సీసీ ఫుటేజీ)

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కృష్ణారెడ్డి చేతి వాటం ప్రదర్శించారు. ఆలయ ఆస్తులను పరిరక్షించాల్సిన ఆయనే స్వయంగా హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను అపహరిస్తూ నిఘా నేత్రాలకు పట్టుబడ్డాడు. వివరాలు.. పవన్ సెక్యూరిటీ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో ఆలయంలో సెక్యూరిటీ సిబ్బందితో కలుపుకుని మొత్తం 70 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఏజెన్సీ నిర్వాహకుడు, కాంట్రాక్టర్ అయిన కృష్ణారెడ్డి దాదాపు 20 ఏళ్లుగా ఆలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ నెల 17న ఆదివారం వేకువజామున 4 గంటలకు అర్చకులు స్వామివారికి అభిషేకం చేస్తుండగా గర్భగుడి ఎదురుగా ఉన్న హుండీలోకి చెయ్యి పెట్టి 2 నిమిషాల వ్యవధిలో 8 సార్లు అందులోని నగదును తీసి తన ప్యాంటు జేబులో పెట్టుకున్నాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరా పుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి. అదే సమయంలో మరో వ్యక్తి కూడా చోరీ విషయాన్ని గమనించాడు.

నిజాన్ని బయటపెట్టిన అజ్ఞాత వ్యక్తి

ఉదయం 10గంటలకు విధులకు హాజరైన ఆలయ అధికారులు ముందుగా సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించాలి. అయితే ఇందుకు విరుద్ధంగా ఎవరి పనుల్లో వారు నిమగ్నం కావడంతో సెక్యూరిటీ ఆఫీసర్ చేసిన చోరీ విషయాన్ని అజ్ఞాత వాసి నెమ్మదిగా బయటపెట్టాడు. విషయం తెలుసుకున్న గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి వెంటనే స్పందించారు. ఘటనపై ఆరా తీస్తూ అధికారులను నిలదీశారు. దీంతో ఆలయ పాలక మండలి సభ్యులతో కలసి అధికారులు సోమవారం ఉదయం నాటి సీసీ పుటేజీలను పరిశీలించడంతో కృష్ణారెడ్డి బాగోతం వెలుగు చూసింది. వెంటనే అతన్ని విధుల నుంచి తప్పిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై ఎస్‌ఐ గోపాలుడు మాట్లాడుతూ ప్రస్తుతం తిరుమల బ్రహ్మోత్సవాల్లో ఉన్న తాను తిరిగి రాగానే దర్యాప్తు చేపడతామని పేర్కొన్నారు.

వీరాకు 'రాజస్తాన్ రాయల్స్' పిలుపు



కేహెచ్ వీరారెడ్డి

అనంతపురం: జిల్లాకు చెందిన వర్ధమాన క్రికెటర్ కేహెచ్ వీరారెడ్డికి అరుదైన అవకాశం దక్కింది. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో అత్యుత్తమ ప్రదర్శనతో రాయలసీమ కింగ్స్ జట్టు విజయానికి కారణమైన వీరారెడ్డి.. ఆ టోర్నీలో ఎమర్జింగ్ ప్లేయర్‌గా అవార్డు దక్కించుకున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలోనే రెండో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా రికార్డు సైతం నెలకొల్పిన ఆయన ఆటతీరుపై ప్రశంసలూ వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే తమ జట్టులో ప్రాతినిధ్యం వహించాలంటూ ముంబయి ఇండియన్స్‌తో పాటు రాజస్తాన్ రాయల్స్ నుంచి ఆయనకు పిలుపు అందింది. అయితే నాగపూర్‌లో జరిగే మూడు రోజుల శిక్షణకు హాజరు కావాలన్న రాజస్తాన్ రాయల్స్ పిలుపుపైనే వీరారెడ్డి మక్కువ చూపుతున్నట్లు తెలిసింది. ఈ అవకాశం దక్కితే అనంతపురం ఉమ్మడి జిల్లా నుంచి ఐపీఎల్‌లో అరంగ్రేటం చేసిన తొలి క్రికెటర్‌గా ఆయన ఖ్యాతి గడించనున్నారు.

కర్ణాటక వాసి దుర్మరణం

ఆత్మకూరు: జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో కర్ణాటక వాసి దుర్మరణం పాలయ్యాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా మహదేవపుర గ్రామానికి చెందిన జగదీష్ (25)తో పాటు మరో ముగ్గురు శ్రీసత్యసాయి జిల్లా అమరాపురానికి చెందిన ఐచర్ వాహనం తీసుకుని హైదరాబాద్‌కు బాయిలర్ కోళ్లను తీసుకువచ్చేందుకు బయలుదేరారు. సోమవారం తెల్లవారుజాము 3 గంటలకు ఆత్మకూరు సమీపంలో జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా ఎదురుగా రోడ్డు పక్కనే ఆగి ఉన్న సిమెంట్ లారీ వెనుక భాగాన్ని ఢీకొన్నారు. ఘటనలో ఐచర్ బోల్తాపడింది. జగదీష్ ముఖం ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని స్థానికులు వెంటనే అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. కాగా, జగదీష్, అతని సోదరుడు నాగరాజు ఇద్దరూ కోళ్ల బాక్సులను ఎత్తడానికి కూలీలుగా వెళ్లేవారు. జగదీష్‌కు వివాహమై ఓ కుమార్తె కూడా ఉంది. ఘటనపై ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జలం.. ఇంకితేనే బలం!

- ప్రతి నీటిబొట్టూ ఒడిసి పట్టేలా చర్యలు
- జిల్లాలో ఇంకుడు గుంతల తవ్వకానికి శ్రీకారం
- ప్రభుత్వ కార్యాలయాల వద్ద యుద్ధప్రాతిపదికన పనులు



భూపసముద్రంలో పనులు చేస్తున్న కూలీలు

రాయదుర్గం: నేలమీద పడే ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టి.. భూగర్భ జలాలు వృద్ధిలోకి తీసుకొచ్చేలా ఉపాధి హామీ పథకం ద్వారా సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నీరు మనిషికి ప్రాణాధారం. అలాంటి జలం భూమిలో ఇంకితేనే భవిష్యత్తు తరానికి బలం. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇంకుడు గుంతల తవ్వకానికి పెద్దపీట వేసింది. భూగర్భ జలాల వృద్ధి, సంరక్షణకు ఈ విధానం ఎంతగానో దోహదపడుతుందని ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర జలశక్తి అభియాన్ బృందానికి అధికారులు తేల్చి చెప్పారు. దీంతో డ్వామా ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల ఆవరణాల్లో ఇంకుడు గుంతల తవ్వకానికి ప్రణాళికలు రూపొందించారు.

140 ఇంకుడు గుంతలు పూర్తి.. : భూగర్భ జలాలు మరింత పెంచేలా జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలో 250 ఇంకుడు గుంతలు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించారు. తొలుత మండలానికి 10 తగ్గకుండా ఉండేలా కార్యాచరణ సిద్ధం చేశారు. జిల్లాలో 70 శాతం కూలీలు వంద శాతం పనిదినాలు పూర్తి చేసుకున్నారు. ఈ కారణంగా పనులకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. 10 నుంచి 5కు కుదించి తప్పక చేపట్టేలా ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 140 ఇంకుడు గుంతల నిర్మాణాలు పూర్తిచేశారు.

నిర్మాణం ఇలా : జిల్లాలో ఇంకుడు గుంతల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. పెద్ద సైజు గుంతకు రూ.74,656, చిన్న సైజు గుంతకు రూ.53,200 ఖర్చు చేయనున్నారు. 6 మీటర్ల లోతు ఉండేలా గుంతను డిజైన్ చేశారు. సిమెంట్, ఇసుక, కంకర, ఇతర సామగ్రిని గుంత ఏర్పాటుకు వినియోగిస్తారు. నిర్ణీత లోతులో వీటిని ఉంచిన తర్వాత ఇసుక పై భాగంలో ఫ్లయాష్ ఇటుకలతో చుట్టూ చిన్న పిట్టగోడ నిర్మిస్తారు. దీంతో ఇంకుడు గుంత నిర్మాణం పూర్తయి వర్షం నీరు నేలలో ఇంకిపోతుందని టెక్నికల్ అధికారులు చెబుతున్నారు.

ప్రయోజనాలు..

- ఇంకుడు గుంత ఏర్పాటు వల్ల జల సంరక్షణ మెరుగవుతుంది.
- బోర్లకు అవసరమైన నీటి లభ్యత పెరుగుతుంది.
- వర్షం నీరు ఎక్కడికక్కడ భూమిలోకి ఇంకి, భూగర్భ జలాల పెరుగుదలకు దోహదపడతాయి.
- భవిష్యత్తు తరానికి నీటి కొరత రాకుండా ఉపయోగపడతాయి.
- పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడి, దోమల బెడద తగ్గుతుంది.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షం



కళ్యాణదుర్గం: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడంపై రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. కేంద్రం నిర్ణయాన్ని అభినందించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే చట్టసభల్లో మహిళలకు పెద్దపీట పడిందని, అదే దోవలో కేంద్ర ప్రభుత్వం కూడా మహిళలకు సముచిత స్థానం కల్పిస్తూ ముందుకు సాగడం అందరూ స్వాగతించాల్సిన అంశమన్నారు.

జిల్లా జడ్జి, కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ





జిల్లా జడ్జి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ అన్బురాజన్, కలెక్టర్ గౌతమికి బొకే అందజేస్తున్న ఎస్పీ

అనంతపురం అర్బన్: జిల్లా జడ్జి జి.శ్రీనివాస్, కలెక్టర్ ఎం.గౌతమిని నూతన ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ మంగళవారం వారి క్యాంపు కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా పరిస్థితులపై చర్చించారు.

విజిలెన్స్ ఈఈ బాధ్యతల స్వీకరణ



ఈఈ గోపికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

అనంతపురం టౌన్: విద్యుత్ శాఖ విజిలెన్స్ ఈఈగా గోపి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈఈగా పని చేసిన యుగంధర్‌ను అన్నమయ్య జిల్లా మదనపల్లికి పనిచేసిన విషయం తెలిసిందే. దీంతో బాధ్యతలు స్వీకరించిన గోపికి అనంతపురం డీఈ రామాంజినేయులరెడ్డి, నాగేంద్ర, మహబుబ్‌పీరా, వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల యూనియన్ నాయకుడు బషీర్ పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, తదితరులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష ఫలితాలను మంగళవారం ఆ వర్సిటీ వీసీ ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి విడుదల చేశారు. మొత్తం 158 మంది ఇన్‌స్టంట్ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, హాజరైన 157 మంది కూడా ఉత్తీర్ణులయ్యారు. ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచారు. డిగ్రీలో ఒక సబ్జెక్టు మినహా అన్ని సబ్జెక్టులూ ఉత్తీర్ణత చెందిన 5, 6వ సెమిస్టర్‌కు చెందిన విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్ష రాసే అవకాశం కల్పించినట్లు ఈ సందర్భంగా వీసీ పేర్కొన్నారు. ఈ నెల 15న పరీక్ష నిర్వహించి కేవలం 48 గంటల్లోనే ఫలితాలు విడుదల చేసిన పరీక్షల విభాగం అధికారులను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీరాములు నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ చంద్రాయుడు, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కృష్ణుడు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు మహేష్

రాయదుర్గంటౌన్: కుటుంబ సమస్యల నేపథ్యంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురానికి చెందిన మహేష్ (28)కు భార్య మేఘన, ఏడాది వయసున్న కుమార్తె ఉన్నారు. భార్య, ఆమె తల్లితో తరచూ గొడవలు చోటు చేసుకుంటుండడంతో మూడు నెలల క్రితం తన మకాన్ని రాయదుర్గంలోని సిద్దేశ్వర కాలనీ బైలాంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న ఇంటికి మార్చాడు. స్థానికంగానే ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయినా కుటుంబలో గొడవలు ఆగలేదు. భార్య తరచూ గొడవ పడుతుండడంతో మనస్తాపానికి గురైన మహేష్ మంగళవారం ఉదయం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇరుగుపొరుగు వారి నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పీవీకేకే ఏఓ ఆత్మహత్య

అనంతపురం సిటీ: పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డికి చెందిన పీవీకేకే కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) వడ్డే ధనుష్‌కుమార్ (28) ఆత్మహత్య చేసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బకు చెందిన ఆయన అనంతపురంలోని నేషనల్ పార్క్ సమీపంలో రైలు కింద పడి మంగళవారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ విజయకుమార్ ధ్రువీకరించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. రైలు చక్రం దూసుకెళ్లడంతో మొండెం నుంచి తల వేరైంది. ఘటనాస్థలాన్ని జీఆర్పీ ఎస్‌ఐ విజయకుమార్ పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సర్వజనాస్పత్రికి తరలించారు. విషయాన్ని ముదిగుబ్బలోని ఆయన కుటుంబసభ్యులకు చేరవేశామని, వారు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

24న జిల్లా స్థాయి యోగా పోటీలు

అనంతపురం: ఈ నెల 24న ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజశేఖరరెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురంలోని రెవెన్యూ కాలనీలో ఉన్న వివేకానంద భవన్‌లో జరిగే పోటీలకు 9 నుంచి 55 సంవత్సరాల వయసున్న వారు పాల్గొనవచ్చు. వయసును బట్టి మొత్తం ఆరు విభాగాలుగా పోటీలను నిర్వహించనున్నారు. పోటీల్లో విజేతలకు నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 24వ తేదీ ఉదయం 8 గంటల్లోపు పేర్లు నమోదు చేసుకోవాలని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఈఎస్ మారుతీ ప్రసాద్, శ్రీనివాసులు తెలిపారు.

హెచ్చెల్సీలో గుర్తు తెలియని మృతదేహం

బొమ్మనహాళ్: మండలంలోని గొనూరు శివారులో హెచ్చెల్సీ డిస్ట్రిబ్యూటరీ కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ యుగంధర్, ఎస్‌ఐ శివ అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి పరిశీలించారు. ఎలాంటి దుస్తులు లేవని కేవలం డ్రాయర్ మాత్రమే ఉంది. దాదాపు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సుంటుందని అంచనా వేశారు. శరీరం కుళ్లి, దుర్వాసన వెదజల్లుతోంది. మూడు రోజుల క్రితం హెచ్చెల్సీ ప్రధాన కాలువ నుంచి పిల్ల కాలువలోకి మృతదేహం కొట్టుకు వచ్చి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతుడి వివరాలు తెలియకపోవడంతో కాలువ వద్దనే పోస్టుమార్టం చేపట్టి, అంత్యక్రియలు నిర్వహించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గమనించకపోతే దగా పడతారు!

అనంతపురంలోని హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న వెంకటేష్ ఇంటికి గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసేందుకు బాయ్ వచ్చాడు. దానికి సీల్ లేదు. ఇదే విషయాన్ని వెంకటేష్ నిలదీశాడు. వాచర్ లీకేజీ ఉందేమోనని చెక్ చేసేందుకు సీల్ తొలగించినట్లు చెప్పి సిలిండర్ ఇచ్చి బాయ్ వెళ్లిపోయాడు. తర్వాత తనకు తెలిసిన వ్యాపారి వద్ద నుంచి స్ప్రింగ్ త్రాసు తీసుకువచ్చి తూకం వేసి చూస్తే దాదాపు 2.5 కిలోల వంటగ్యాస్ తక్కువగా ఉన్నట్లు తేలింది. గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే మోసపోతారనేందుకు వెంకటేష్ ఘటనే నిదర్శనం.

- వంట గ్యాస్ సరఫరాపై అప్రమత్తత అవసరం
- సిలిండర్ సీల్‌ని తనిఖీ చేయండి
- నిర్ణీత బరువుపై తూకం వేసి నిర్ధారించుకోవాలి
- గ్యాస్ లీకేజీతో పెను ప్రమాదం



అనంతపురంలో సిలిండర్ తూకం వేసి చూపిస్తున్న డెలివరీబాయ్

అనంతపురం అర్బన్: వంట గ్యాస్ సిలిండర్ల డెలివరీ సమయంలో తూకాల్లో మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఇటీవల కొందరు డెలివరీ బాయ్స్ సిలిండర్ల సీల్ తొలగించి, మరో సిలిండర్‌లోకి ఒకటి నుంచి రెండు కిలోల వరకూ గ్యాస్‌ను బదలాయించి సరఫరా చేస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని పేర్కొంటున్నారు. ఈ తరహా మోసాలకు విద్యావంతులు కాని వారే అత్యధికంగా బలవుతున్నారన్నారు.

సీల్ ఉందా లేదో చూసుకోండి

గ్యాస్ సిలిండర్ నాబ్‌కి కంపెనీ సీల్ వేసి పంపుతుంది. అలా సీల్ వేసినవే తీసుకోవాలి. వంట గ్యాస్ డెలివరీ సమయంలో తప్పనిసరిగా సీల్‌ని పరిశీలించాలి. అది బిగుతా లేకుండా ఊడిపోయినట్లు ఉన్నా వెంటనే తిరస్కరించాలి. సీల్ తొలగించడం నేరం. సీల్ తొలగించిన సిలిండర్లను సరఫరా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. సీల్ తొలగించిన సిలిండర్ సరఫరా చేస్తే విషయాన్ని వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలి.


గ్యాస్ లీకేజీనూ పరిశీలించుకోవాలి

రెగ్యులేటర్ అమర్చే ముందు నాబ్ వద్ద రబ్బర్ వాచర్ సక్రమంగా లేకపోతే వంట గ్యాస్ లీక్ అవుతుంది. కాబట్టి సిలిండర్ నుంచి గ్యాస్ లీకవుతోందా అనేది డెలివరీ సమయంలోనే బాయ్ ద్వారా చెక్ చేయించాలి. ఒక వేళ గ్యాస్ లీకవుతోంటే వెంటనే వాచర్ మారుస్తారు. అంతేకాక ఒకటో, రెండో వాచర్లు ఇంట్లో ఉంచుకోవడం ఉత్తమం. ఎప్పుడైనా గ్యాస్ లీకవుతుంటే మీరే స్వయంగా వాచర్ మార్చుకోవచ్చు.

స్ప్రింగ్ త్రాసు తప్పని సరి

వంట గ్యాస్ సిలిండర్లు డెలివరీ బాయ్... తన వెంట తప్పని సరిగా స్ప్రింగ్ త్రాసు ఉండాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. గృహావసర సిలిండర్‌ను తూకం వేసినప్పుడు దాని మొత్తం బరువు 29.500 కిలోలు ఉండాలి. ఇందులో సిలిండర్ బరువు 15.300 కిలోలు పోను, మిగిలిన 14.200 కిలోలు వంట గ్యాస్ ఉంటుంది. డెలివరీ బాయ్స్ తమ వెంట తెచ్చుకున్న స్ప్రింగ్ త్రాసు ద్వారా సిలిండర్‌ను తూకం వేసి వినియోగదారునికి దాని బరువు చూపించి ఇవ్వాలి. సిలిండర్ బరువు తక్కువగా ఉన్నట్లు అనుమానం వస్తే తక్షణం తూకం వేయించి సరిచూసుకోవాలి. స్ప్రింగ్ త్రాసు లేదని చెబితే ఆ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

ఫిర్యాదు చేయండి



కంపెనీ సీల్‌తోనే వంట గ్యాస్ సిలిండర్‌ని డెలివరీ చేయాలి. అలా చేయలేదని తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. డెలివరీ బాయ్స్ కూడా వెంట స్ప్రింగ్ త్రాసు తీసుకెళ్లాలి. సిలిండర్ డెలివరీ చేసేటప్పుడు తప్పనిసరిగా తూకం వేసి వినియోగదారులకు అందజేయాలి. అలాగే గ్యాస్ లీక్‌జీని చెక్ చేసి ఇవ్వాలి. సిలిండర్ అందజేసే క్రమంలో బాయ్స్ ఇబ్బంది పెట్టినా, బరువులో తేడా గమనించినా వెంటనే జిల్లా సరఫరాల అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు.

– శోభారాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి

క్లుప్తంగా

విశ్వనాథరెడ్డికి డాక్టరేట్



బి.విశ్వనాథ రెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్సు విభాగంలో పరిశోధన చేసిన బి.విశ్వనాథ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ వి.రఘునాథ రెడ్డి పర్యవేక్షణలో ' ఫోర్‌క్యాస్టింగ్ మల్టీపాథ్ రూటింగ్ ప్రొటోకాల్స్ ఇన్ వైర్‌లెస్ మల్టీమీడియా సెన్సార్ నెట్ వర్క్స్' అనే అంశంపై ఈయన పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

భాగస్వాములు కావాలి



శ్రమదానం చేస్తున్న రైల్వే సిబ్బంది

అనంతపురం సిటీ: 'స్వచ్ఛ భారత్' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గుంతకల్లు రైల్వే డివిజన్ డీసీఎం సోమశేఖర్ నాయుడు, అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక రైల్వే స్టేషన్ సహా పరిసరాల్లో స్వచ్ఛభారత్ సంకల్పంలో భాగంగా శ్రమదానం చేశారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

బోడమల్లయ్య స్వామి ఉత్సవం



పూజలకు తరలివచ్చిన భక్తులు

రాప్తాడు: మండలంలోని హంపాపురం, గొల్లపల్లి గ్రామాల మధ్య పొలాల్లో వెలసిన బోడమల్లయ్య స్వామికి బాలగొండ కాపులు (కురుబలు) మంగళవారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు స్వామి కాపులే కాక ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సాయంత్రం వరకు మహిళలు మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కళ్యాణదుర్గం, బళ్లారి రోడ్డులో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రాంతాల్లో ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి ఆదేశాల మేరకు సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన రోడ్లలోని 'యూ టర్న్'ల వద్ద వేగ నియంత్రణకు డ్రమ్ములు ఏర్పాటు చేశారు. కళ్యాణదుర్గం రోడ్డులోని పాపంపేట, నరిగిమ్మ ఆలయం వద్ద, బళ్లారి రోడ్డులో సాయిబాబా గుడి వద్ద, ఎంకేఎం ఫంక్షన్ హాల్ కూడలి వద్ద ప్రధాన రోడ్డుకు ఇరువైపులా డ్రమ్ములు ఏర్పాటు చేశారు.


నైపుణ్యంతోనే గుర్తింపు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ

అనంతపురం కార్పొరేషన్: మంచి నైపుణ్యంతోనే గుర్తింపు లభిస్తుందని, తద్వారా ఉద్యోవకాశాలు విరివిగా లభిస్తాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పారా మెడికల్ కోర్సులకు సంబంధించి నిర్వహించిన కౌన్సెలింగ్ జరిగింది. 6 ప్రైవేట్ పారా మెడికల్ ట్రైనింగ్ కళాశాలలో మెరిట్ ఆధారంగా 108 సీట్లను భర్తీ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చెన్నకేశవులు, పరిపాలనాధికారి గిరిజ మనోహర రావు, సూపరింటెండెంట్ విజయభాస్కర్ రెడ్డి, ఎస్సీ సోషియల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ రవికాంత్, సీనియర్ అసిస్టెంట్స్ సురేష్, కమలాకర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

'దక్షిణ దిశగా' నవల ఆవిష్కరణ



నవలను ఆవిష్కరిస్తున్న బండి నారాయణ స్వామి తదితరులు

అనంతపురం కల్చరల్: విమలాశాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ నేతృత్వంలో ప్రముఖ ఆంగ్లోపన్యాసకులు పెరుమాళ్ నారాయణ రచించిన 'దక్షిణ దిశగా' నవలను మంగళవారం ఆవిష్కరించారు. సంస్థ అధ్యక్షుడు సీనియర్ రచయిత డాక్టర్ శాంతి నారాయణ ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో హోమ్‌లో జరిగిన కార్యక్రమానికి సీనియర్ రచయితలు నందవరం కేశవరెడ్డి, ఆకపచ్చ వెంకటేశులు, రాజారాం, కొండమీద రాయుడు, నర్సిరెడ్డి, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, సుగుణ, ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, కవులు జూటూరు షరీఫ్, మధురశ్రీ, పెద్దన్న , ఈరన్న, రియాజుద్దీన్ పాల్గొన్నారు.

వృద్ధుడు ఆత్మహత్య

ఆత్మకూరు: తోపుదుర్తిలో కడుపునొప్పి తట్టుకోలేక వడ్డే రామాంజనేయులు (67) సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన వడ్డే రామాజినేయులు కూలి పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. కడుపునొప్పితో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. నయం కాకపోవడంతో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఏకదంతం..బహురూపం



చిన్మయనగర్‌లో గణనాథులు



ఎల్‌ఐజీ కాలనీలో కొలువుదీరిన వినాయకుడు



కమలానగర్‌లో గణపతి

అనంతపురం కల్చరల్: వినాయక చవితిని పురస్కరించుకొని వీధివీధిలోనూ భారీ విగ్రహాలు కొలువుదీర్చారు. నగరంలో పలుచోట్ల విభిన్న ఆకారాల్లో ఏకదంతుడు దర్శనమిచ్చాడు. ఎస్కేయూ రోడ్డు సమీపంలో ఎన్‌టీఎస్ కాలనీలో ఏర్పాటు చేసిన వరల్డ్‌కప్ వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. బుడ్డప్పనగర్‌లోని కాంతారా వినాయకుడు, పాతూరులోని ఎకో గణపతి, రాణీనగర్‌లో భరతమాత వినాయకుడు, మూడోరోడ్డులో త్రీడీ వినాయకుడు, పాతూరు అమ్మవారిశాల, నగరంలోని చెరువుకట్టపై వెండి కవచాలంకారంలో ప్రత్యేక పూజలందుకున్నారు. నగరంలోని సప్తగిరి సర్కిల్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలోని కదలికల వినాయక ఉత్సవాలను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వాసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్యం ప్రారంభించారు. అనంతరం పరుచూరు రమేష్ బృందం కర్ణాటక రాష్ట్రంలోని చిక్కమంగళూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన కమండల గణపతి వృత్తాంతాన్ని విద్యుత్ కదలికలతో హృద్యంగా ప్రదర్శించారు.



సప్తగిరి సర్కిల్‌లో గణేశుడి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

అనంతపురం సిటీ: అనంతపురం రాంనగర్‌లోని అలెగ్జాండర్ హోమ్స్‌లో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరిగాయి. అలెగ్జాండర్ హోమ్స్ మహిళలు శాంత, శోభ, కుసుమ, సుజాత, సుభద్ర, శారద ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఏకదంతుడి విగ్రహానికి సుందరంగా అలంకరించారు.

రాప్తాడు: మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ప్రజలు వాడవాడలా వినాయక చవితిని జరుపుకున్నారు. రాప్తాడు, చిన్మయనగర్, ఇందిరమ్మ కాలనీ, మరూరు, ఎం.బండమీదపల్లి, గొందిరెడ్డిపల్లి, హంపాపురం, బుక్కచెర్ల తదితర గ్రామాల్లో వెలసిన విగ్రహాలు ఆకట్టుకున్నాయి. మండల వ్యాప్తంగా 100 విగ్రహాలు చేయగా, రాప్తాడులో 20 విగ్రహాలు, ఏర్పాటు చేశారు.



రెవెన్యూ కాలనీలోని దశావతార వినాయకుడు , ప్రాచీన వినాయకుడు



రామచంద్ర నగర్‌లో కొలువుదీరిన వరసిద్ధి వినాయకుడు




శ్రీనివాసనగర్‌లో శంకు వినాయకుడు



బోయ వీధిలో శివాజీఅలంకారం



ఇందిరానగర్‌లో ఆంజనేయుడుపై కొలువుదీరిన వినాయకుడు



వరల్డ్‌కప్ వినాయకుడు



రాప్తాడులో...



కాంతార వినాయకుడు,పాతూరు గాలం వీధిలో..



నాయీబ్రాహ్మణ కాలనీలో రథం నడుపుతూ...



సప్తగిరి సర్కిల్‌లోని వినాయకచౌక్‌లో కొలువుదీరిన వినాయకుడు



సప్తగిరిసర్కిల్‌లోని వినాయక చౌక్‌లో దర్శనానికి వస్తున్న ముస్లిం మహిళలు



ఉక్కలం వీధిలో ఏనుగు తలపై వినాయకుడు



వైద్య కళాశాలలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు



కృష్ణకళామందిర్‌లోని రెవెన్యూభవన్‌లో వేడుకల్లో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు



వినాయక చౌక్‌లో వినాయకున్ని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అనంత,మేయర్ వసీం



కోవూరు నగర్‌లో ప్రత్యేక అలంకరణలో వినాయకుడు



ఆర్టీటీ ఆఫీస్ వద్ద కల్కి భగవాన్ వినాయకుడు

సంక్షిప్త సమాచారం

వైఎస్సార్ బీమా సాయం అందజేత

రాప్తాడు: మండల కేంద్రానికి చెందిన శీల్ల లక్ష్మీనారాయణ ఈ నెల 16న అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మృతుడి భార్య శీల్ల నాగవేణికి వెల్ఫేర్ అసిస్టెంట్ వేణుగోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ జూటూరు శేఖర్ రూ.10 వేలు నగదును మంగళవారం అందజేశారు. నాయకులు వార్డు మెంబర్ జయన్న, మన్నల రవి, చిరుతల నాగేంద్ర, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక

రాప్తాడు: ఏపీటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా కె.ఆదినారాయణ, గౌరవ సలహదారుగా జి.నరసింహులు, మండల అధ్యక్షులుగా పి.అంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శిగా జె.ఓబులేష్‌ను ఎన్నుకున్నారు.

నల్లాని రాజేశ్వరికి సేవారత్న అవార్డు

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త నల్లాని రాజేశ్వరి అంతర్జాతీయ సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారిని ఎంపిక చేశారు. ఈనెల 23న గుంటూరులో జరగనున్న అక్కినేని శత జయంతి వేడుకల్లో అవార్డు ప్రదానం చేయనున్నారు.

ప్రజారోగ్య రక్షణే లక్ష్యం

రాప్తాడు: ప్రజారోగ్య పరిరక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని సీహెచ్‌ఓ శివప్రసాద్ అన్నారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేస్తున్నారు. సీహెచ్‌ఓ మాట్లాడుతూ ఈ నెల 29 వరకు వలంటీర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు, ఆరోగ్య కార్యదర్శులు, వైద్యసిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి, ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించాలన్నారు.

నేడు సంగీత కచేరీ

అనంతపురం కల్చరల్: నగరంలోని రాజీవ్ చిల్డ్రన్స్ పార్కు వద్ద ఘంటసాల ఆరాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు సంగీత కచేరీ ఉంటుందని నిర్వాహకులు రామయ్య, పాలసముద్రం నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు అక్కినేని శతజయంతి : ప్రఖ్యాత సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా బుధవారం సాయంత్రం 5 గంటలకు సంగీత కచేరీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రామయ్య, పాలసముద్రం నాగరాజు తెలిపారు.

రాప్తాడు: గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ ఆంజనేయులు సూచించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవ కమిటీ నిర్వాహకులతో మాట్లాడారు.

నిమజ్జనానికి సహకరించాలి

అనంతపురం క్రైం: వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరగడానికి ప్రజలు సహకరించాలని డీఎస్పీ ప్రసాద్ రెడ్డి, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక డీఎస్పీ కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రశాంతంగా ప్రజలు నిమజ్జనం చేసుకునే విధంగా పోలీస్ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. అగ్నిమాపక, విద్యుత్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకొని అన్ని చర్యలూ తీసుకున్నట్లు తెలిపారు. బుధవారం జరగనున్న నిమజ్జనం కొన్ని ప్రాంతాల్లో చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. భారీ విగ్రహాలను బుక్కరాయసముద్రం చెరువు, కొడిమి వంక, పంపనూరు సమీపంలోని హెచ్ఎల్ఎస్ఎస్ కాలువల్లో నిమజ్జనం చేసుకోవాలన్నారు. మూడు అడుగులలోపు ఎత్తు ఉన్న విగ్రహాలను రాప్తాడు పండమేరు, నారాయణపురం చెక్ డ్యాం ప్రాంతాల్లో నిమజ్జనం చేసుకోవచ్చన్నారు.

నిమజ్జనానికి పటిష్ట భద్రత : నిమజ్జనం చేసే ప్రాంతాలతో పాటు విగ్రహాలు ఊరేగింపు మొదలుకొని పూర్తయ్యే వరకూ పటిష్ట భద్రత ఉంటుందని డీఎస్పీలు తెలిపారు. సాయంత్రంలోపు నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తిచేయాలని కోరారు. పీస్ కమిటీలు, వినాయక ఉత్సవ కమిటీ ఆర్గనైజర్స్ కూడా నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా సూచనలు చేశామన్నారు. నిమజ్జన సమయంలో డీజే సౌండ్ పెట్టరాదన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

అనంతపురం కార్పొరేషన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. మంగళవారం 38వ డివిజన్‌లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మేయర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఏఎన్ఎం తదితర సిబ్బంది ప్రజలకు అందిస్తున్న 7 రకాల సేవలను మేయర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ నగరంలోని 10 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. 64 రకాల వైద్య పరీక్షలు, 172 రకాల మందులను ఉచితంగా ఇస్తున్నారన్నారు. ఈ నెల 30 నుంచి వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో జరిగే క్యాంపులకు ప్రజలను తీసుకెళ్లాలన్నారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహిత్, కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, అనిల్, నాయకులు ఖాజా, సచివాలయ ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పంటల బీమా కొనసాగించాలి

అనంతపురం అర్బన్: ప్రభుత్వమే పంటల బీమా పథకాన్ని కొనసాగించాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.శ్రీధర్‌ను కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన చాంబర్‌లో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు బీహెచ్‌రాయుడు, పాతులయ్య, రామకృష్ణారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు.

ఎస్పీని కలిసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

అనంతపురం కార్పొరేషన్: జిల్లా నూతన ఎస్పీ అన్బురాజన్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి ఆయన పుష్పగుచ్ఛం అందించారు. ఎస్పీని కలిసిన వారిలో పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, అనుబంధ సంఘాల అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, ఎగ్గల శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు గౌస్‌బేగ్, ధనుంజయయాదవ్, చుక్కలూరు దిలీప్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

అనంతపురం క్రైం: నూతన ఎస్పీ అన్బురాజన్‌ను జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు.



ఎస్పీని కలిసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా తదితరులు

ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ

ఎగనామం

- ఇంపాక్ట్ ఫీజులు చెల్లించని భవన నిర్మాణదారులు
- పరోక్షంగా సహకరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- మాస్టర్ ప్లాన్ రోడ్డులోని నిర్మాణాలకు ఇంపాక్ట్ ఫీజులు తప్పనిసరి
- రూ.కోట్లలో డబ్బులు చెల్లించకున్నా పట్టించుకోని అధికారులు

అనంతపురం నగరపాలక సంస్థ

మొత్తం డివిజన్లు - 50

మాస్టర్ ప్లాన్ రోడ్లు - 16

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ అధికారుల బాధ్యతారాహిత్యం భవన నిర్మాణదారులకు వరంగా మారింది. భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి వివిధ ఫీజులతో పాటు చెల్లించాల్సిన ఇంపాక్ట్ ఫీజును చెల్లించలేదు. మాస్టర్ ప్లాన్ రోడ్డుకు (60 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు, 300 చదరపు అడుగుల సైట్ ఏరియా) సమీపంలో ఉన్న భవనాలు ఇంపాక్ట్ ఫీజులు చెల్లించాలని గత నెలలో ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. అయితే ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేయడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.

- నగరంలోని సుభాష్‌రోడ్డు శాంతి థియేటర్ సమీపంలో దాదాపుగా 30 సెంట్లలో ఓ భారీ కమర్షియల్ భవనాన్ని నిర్మిస్తున్నారు. మార్కెట్ ధర ప్రకారం 2 శాతం ఇంపాక్ట్ ఫీజు చెల్లించాల్సి ఉంది. ఆ లెక్కన రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఇంపాక్ట్ ఫీజు చెల్లించాలి. ఆ చెల్లింపులు చేయకుండానే నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఈ నిర్మాణ అనుమతులు షార్ట్ ఫాల్‌లో ఉంది.
- సుభాష్‌రోడ్డు క్రాస్ సర్కిల్ సమీపంలోనూ ఓ భారీ భవన నిర్మాణం జరుగుతోంది. ఈ నిర్మాణానికి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఇంపాక్ట్ చెల్లించాల్సి ఉంది. కానీ నిర్మాణదారుడు చెల్లించకుండానే పనులు ప్రారంభించాడు. నగరంలోని బళ్లారి రోడ్డు నుంచి నగరపాలక సంస్థ, కళ్యాణదుర్గం రోడ్డు నుంచి నగరపాలక సంస్థ, నగరపాలక సంస్థ నుంచి ఆర్టీసీ బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ నుంచి గుత్తి రోడ్డు, శ్రీకంఠం సర్కిల్ నుంచి తిలక్ రోడ్డు, ఎన్‌టీఆర్ మార్గ్ (పాతూరు), గుత్తి రోడ్డు కనకదాసు విగ్రహం రోడ్డు, నగరపాలక సంస్థ నుంచి విద్యుత్‌నగర్ సర్కిల్, విద్యుత్‌నగర్ సర్కిల్ నుంచి శ్మశానానికి వెళ్లే రోడ్డు, టీటీడీ కళ్యాణ మంటపం నుంచి మొదటి రోడ్డు, రెండో రోడ్డు, సాయినగర్ అంబేడ్కర్ భవన్ 8వ క్రాస్ నుంచి జీసస్‌నగర్ వరకు, నగరపాలక సంస్థ నుంచి రుద్రంపేట, ఇలా మొత్తం నగరంలో 16 మాస్టర్ ప్లాన్ రోడ్లున్నాయి. ఈ మాస్టర్ ప్లాన్ రోడ్లకు 100 మీటర్లలోపు కమర్షియల్ నిర్మాణాలు చేపడితే కచ్చితంగా మార్కెట్ ధర ప్రకారం 2 శాతం ఇంపాక్ట్ ఫీజు వసూలు చేయాలి. నగరంలోని చాలా చోట్ల జరుగుతున్న నిర్మాణాలకు ఇంపాక్ట్ ఫీజులు వసూలు చేయలేదు. దీంతో ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయానికి గండిపడుతోంది.

అధికారుల ప్రేక్షకపాత్ర:

ఇప్పటికే నగరంలో భవనాల అతిక్రమణలు అధికంగా జరుగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా



షెడ్లలో ఆస్పత్రులు, బిరియానీ సెంటర్లు, రెస్టారెంట్లను ఏర్పాటు చేసి భారీగా వ్యాపారం చేస్తున్నారు. వీటికి ఎటువంటి ఫీజులు చెల్లించలేదు. ఇప్పుడు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకాసం వసూలు చేయాల్సి ఇంపాక్ట్ ఫీజులకు టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళం పాడారు. టౌన్ ప్లానింగ్ విభాగంలోని ఓ మహిళా అధికారి నిర్మాణదారులకు పరోక్షంగా సహకరించడంతోనే ఇంపాక్ట్ ఫీజులకు బ్రేక్ పడినట్లు సమాచారం. కమిషనర్ భాగ్యలక్ష్మి ప్రేక్షకపాత్ర పోషిస్తుననా్నరన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆదేశాలు ఇచ్చాం

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇంపాక్ట్ ఫీజులు చెల్లించాలి. నగరంలోని వివిధ మాస్టర్ ప్లాన్‌లున్న రోడ్ల వద్ద జరుగుతున్న నిర్మాణాలు, ఆ నిర్మాణదారులు ఇంపాక్ట్ ఫీజులు చెల్లించారో లేదానని లోతుగా పరిశీలించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించా. ఇంపాక్ట్ ఫీజులు చెల్లించని పక్షంలో నిర్మాణాలను ఆపేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశా.

– భాగ్యలక్ష్మి, కమిషనర్